అత్త లున్న కోడళ్ళూ ఉత్తమురాళ్ళే! కోడళ్ళున్న అత్తలూ గుణవంతురాళ్ళే! ఎలాగా? ఎలాగా?
అపరంజి, అందాల ఆభరణం అయిన ఈ కథలో జవాబులు వెతుక్కోండి.

# ముద్దబంగారం

ఆచంట హైమవతి

"ఏరా రఘూ! కొన్ని విషయాలు మీ ఆవిడకి అర్థం అయ్యేలా చెప్పాలిరా?" మెల్లిగా అంది విశాలాక్షి.

"అదేమిటమ్మా! నాకు ఆవిడేగాని నీకు కోడలు కూడా కదమ్మా? చెప్పాల్సిం దేమైనా ఉంటే నాకు, వందనకి చెప్పినట్లే వాణికి కూడా... నువ్వే చెప్పచ్చును గదా!" ఆశ్చర్యంగా అడిగాడు రఘు.

రఘు మాటలు విని నవ్వుకుంది విశాలాక్షి. అతని నమ్రతని మనసులో మెచ్చుకొని సంతోషపడింది. పైగా "నా కొడుకు సుగుణరత్నం" అనుకొని గర్వపడింది కూడా. పైకి మాత్రం...

"కొత్త కోడలు కదా! నేను ఏదైనా చెప్తే 'అత్తగారు ఆరడి పెడుతోంది' అనుకుని నాపై చెడ్డ అభిప్రాయం కలుగుతుందేమోనని..." చివర మాటలు నాన్చేసింది విశాలాక్షి.

"నాకు కూడా ఆమె కొత్తగా పెళ్ళి చేసుకొని తెచ్చుకొన్న భార్య కదా? వాణికి నేను చెడ్డవాణ్ణి అయినా ఫరవా లేదామ్మా? నీ అభిప్రాయం...?" నవ్వాడు రఘు.

విశాలాక్షి చిన్నబుచ్చుకోవడం చూసి రఘు తడబడుతూ "అమ్మా! వాణి ఏదైనా పొరపాటు చేస్తే దండించే హక్కు నీకు ఉందమ్మా! సరే అసలు విషయం తెలుసుకోకుండా నేను ఏదేదో మాట్లాడా ననుకుంటాను. చెప్పమ్మా! ఏమిటి సంగతి?" కుతూహలంగా అడిగాడు రఘు.

నిదానంగా చెప్పడం మొదలెట్టింది విశాలాక్షి. "ఎంతసేపూ రేడియో, దాంట్లో ప్రసారం పూర్తయితే టేప్ రికార్డరు, టి.వి. ప్రసారం మొదలుపెడితే అదీ. పత్రికలు, నవలలు-ఇవే లోకంగా ఉంటోంది ఆ పిల్లకి. ఇంట్లో చిన్న చిన్న పనులు అందుకుంటే నాకు సహాయంగా ఉంటుంది కదా! పనివాళ్ళకి కూడా వాణిని చూస్తే కొంచెం భయభక్తులు కలగాలంటే ఆ పిల్ల అన్ని విషయాల్లోనూ కలివిడిగా ఉంటూండాలి. కాపరానికి వచ్చి అయిదు, ఆరు నెలలు దాటుతున్నా అంటీ ముట్టనట్టుంటే ఎలా? కొంచెం బాధ్యత తెలుసుకోవాలి గదా!"

నిశ్శబ్దంగా వింటున్నాడు రఘు. వింటూనే ఆలోచిస్తున్నాడు.

"ఏదైనా చెవుదామంటే నే నేమైనా చిన్నపిల్లనా? నాకు తెలియదా అంటుందేమోనని ఆలోచిస్తున్నాను. మన వందన వయసుదే కదా వాణి కూడా.

వందనకి చెప్పినట్లే వాణికీ చెప్పగలను. కాని సాధిస్తున్నా రనుకొని బాధ పడుతుందేమోనని నా భయం..."

సాలోచనగా తల్లి మొహంలోకి చూస్తున్నాడు రఘు. "అమ్మ ఏ మనుకుంటోంది? కోడల్ని దోవలో పెట్టుకోవడానికి నన్ను అనుమతి అడుగుతోందా? లేక నీ భార్యని సరయిన దోవలో పెట్టుకోలేకపోతున్నావ్ అని హేళన చేస్తోందా? నిజంగా అమ్మే ఈ విషయం అంటోందా? ఎవరైనా అమ్మని కోడలి విషయం నిష్ఠూర మాడారా? లోకుల మాటలు పట్టించుకొనే స్వభావం కాదు అమ్మది. అమ్మలాగే నాన్న అనుకుంటున్నారా? 'చెల్లాయ్ వందనకి చెప్పినట్లు' అంటోంది. వందన కాపురానికి వెళ్ళాక ఇంట్లో ఇలాంటి సమస్యలే ఎదురయ్యాయ్యా? ఏమో! వందనని ఎప్పుడూ ఏమీ అడగలేదు."

... వందన వస్తే ఆమెకు కావాల్సినవీ, తనకి సరదా వేసినవీ కొనివ్వడం, సినిమాలకు, షికార్లకు తిప్పడం, బావగార్ని గురించిన హాస్యాలే గాని గంభీరమైన విషయా లెప్పుడూ తమ మధ్య రాలేదు. వందన చెప్పనూ లేదు.

రఘు భ్రుకుటి ముడిపడడం చూసి కొంచెం కంగారు పడింది తల్లి.

"ఏమిటి రఘూ! అంత దీర్ఘాలోచనలో పడిపోయావ్? ఇదేమీ ఘోర సమస్య కాదు. సున్నితంగా పరిష్కరించాల్సినది. నీ కెందుకు చెప్పానంటే సమయం చూసి ఆమెను మెల్లిగా బుజ్జగిస్తూ చెప్తావని..."

సందర్భంలో కొన్ని మార్పులున్నా "చక్కని సమయం చూసి తనను గురించి భర్తకు సిఫార్సు చెయ్యమని వేడుకుంటున్న రామదాసు కీర్తన- "నను బ్రోవమని చెప్పవే సీతమ్మ తల్లీ!" అనేది గుర్తొచ్చింది రఘుకి. కొడుకు చిరునవ్వు మొహం చూడగానే విశాలాక్షికి కంగారు తగ్గి స్తిమిత పడింది. తన ఆలోచన తల్లితో చెప్పాడు రఘు. విశాలాక్షి కొడుకు తల నిమురుతూ "నిజమే! సీతారాముల ఆదర్శం అపురూపమైనదే! ఆనాటి రామదాసు మొదలు ఈనాటి శాయికృష్ణ యాచేంద్ర వరకూ అందరూ అందరూ ఆ పరమాత్ముని భక్త శిశువులే కదూ!" సంభాషణ భక్తుల కీర్తనల మీదకి మళ్ళించి ప్రస్తుత వాతావరణాన్ని తేలిక పరచింది విశాలాక్షి.

విశాలాక్షి ఇంటికి బంధువులు, స్నేహితులు రాకపోక లెక్కువ. అందువల్ల ఇంట్లో పనులూ ఎక్కువే! విశాలాక్షి భర్త చంద్రశేఖరం వ్యాపారం చేస్తుంటాడు. టోకు జవుళి వ్యాపారం. అపరిమిత భాగ్యవంతులు కాకపోయినా దేనికీ తడుముకోవక్కర్లేని స్థితిలో ఉన్నారు. దేశకాల పరిస్థితులను అర్థం చేసుకున్న కుటుంబం అవడం వల్ల సాంఘిక బాధ్యతల్లో తమ భాగంగా పేద కుటుంబంలో పిల్లను చేసుకుంటే ఒక కుటుంబానికైనా సహాయపడ్డట్లు అవుతుం దనుకొన్నారు.

అలా చూసిన సంబంధాలలో కూడా ఓ మోస్తరు అందం ఉండి; ఇంటర్ పాసై, ప్రైవు పరీక్షలు పూర్తి చేసిన వాణిని ఎంచుకున్నారు.

★ ★ ★


ముద్దుగా ముగ్గురు పిల్లలు చాలు అనుకునే రోజులే అయినా మూడోది మగబిడ్డ కావాలి అనే కోరికతో ఉన్న ప్రకాశం, సునందలకు మూడోసారి ఇద్దరు ఆడపిల్లలు కవలలుగా ఉద్భవించారు. దానితో ఇంట్లో నలుగురూ ఆడపిల్లలే అయ్యారు. మగపిల్లవాడి మోజు అంతటితో ముగిసిపోయింది.

వాళ్ళు పుట్టిన రోజులే గడ్డువయితే వాళ్ళు పెరుగుతూ మరింత గడ్డుతనాన్ని అనుభవించారు. పెళ్ళి వయసు వచ్చేసరికి పూర్తిగా అధఃపాతాళానికి వడ్డట్లు స్త్రీల సమస్యలు మరింత పెరిగాయి.

ఉద్యోగ ప్రయత్నంలో ఉంది వాణి. రకరకాల ప్రేమ కథల్ని ఎన్ని చదివినా వాణి మనస్సు ఆకాశంలో ఎప్పుడూ విహరించలేదు. ఒక చిన్న గుమస్తా కూతురు తను. తనకి గొప్ప కట్నం ఇచ్చి పెళ్ళి చేసే స్తోమత తండ్రికి లేదని తెలును. తన పెళ్ళికి కాస్తో, కూస్తో కట్నం తనే సంపాదించుకోవాలి. ముందు మంచి బట్టలు, తర్వాత చిన్న చిన్న నగలు సమకూర్చుని ఆ తర్వాత కట్నం కోసం దాచాలి. తర్వాత పెళ్ళి ఖర్చు? బాబోయ్! ఇవన్నీ ఎప్పటికి సమకూరేను? అసలు ముందు ఉద్యోగం రావాలి కదా! ఎప్పుడు దొరుకుతుంది? అసలు దొరుకుతుందా? తనకి ఏదీ తగినంత లేదు. విద్యా? చాలా తక్కువ. సౌందర్యమా? సంసారపక్షంగా ఉంటుం దంతేను. సామాన్యు లందర్లోకీ అతి సామాన్యురాలు తను." ఇలా తల్చుకుంటూ నిరుత్సాహంతో క్రుంగిపోతూ తిరిగి తనే ధైర్యం తెచ్చుకుంటూ ఉండేది వాణి.

రఘు కుటుంబాన్ని గురించి పక్కింటి

శేషాచలంగారు తంద్రిక వివరిస్తుంటే "ఆఁ! ఈ సంబంధం అయ్యేదా, ఏడిసేదా?" అనుకుని సరిగ్గా వినిపించుకోలేదు వాణి ఆనాడు. పెళ్ళి చూపుల కోసం ఆ కుటుంబం వచ్చినప్పుడు వందన సౌందర్యం, రఘు అందం, విశాలాక్షి



సౌజన్యం, చంద్రశేఖరం గారి వినయ గాంభీర్యం చూసి సంతోషపడబోయి, "ఆఁ! కుదిరేదా, పెట్టేదా? ఎంత మంచి నటించినా వరకట్నం విషయంలో అందరూ దురాశా పాతకులేగా! తన తండ్రి లేమి చూశారుగా కళ్ళారా? వెనక్కి తిరిగి చూడకుండా పరుగెడతారులే! అది మాత్రం గారంటీ!" అనుకొంది వాణి నిర్లిప్తంగా.

వెళ్ళిపోతూ రఘునాథ్ వెనక్కి తిరిగి తన్ని చూసి చిరునవ్వు నవ్వినప్పుడు కొంచెం ఆశ్చర్యపోయింది. కాని అంతలోనే "ఒక యువతిని చూసి యువకుడు తియ్యగా నవ్వడంలో. ఆశ్చర్యపోవలసింది ఏముందిలే - ప్రకృతి సహజం!" అనుకుంది.

వాణి కళ్ళలో నిర్లక్ష్య భావం చూసి, ఈనాటి కన్యలకి వివాహం మీద, వరకట్నం దురాచారం వల్ల కలిగిన నిరసనాభావాన్ని ఊహించగలిగాడు రఘు. అమ్మాయిల నిరసన సబబుగానే తోచింది అతనికి.

ఎంత నిరాడంబరంగా చెయ్యగలిగితే అంత మంచిదని సూచిస్తూ సుముహూర్తం నిర్ణయించి వ్రాసిన చంద్రశేఖరం గారి జాబు చదివి ఇంట్లో అందరూ ఆశ్చర్యపోయారు. వాణికి అసలు నమ్మకం కలగలేదు. కాని తర్వాత రోజు రఘు దగ్గర్నుంచి క్లుప్తంగా చిన్న ప్రేమలేఖ రావడంతో నమ్మక తప్పలేదు.

వదిహేను రోజుల తర్వాత వేణుగోపాలస్వామి దేవాలయంలో శాస్త్రోక్తంగా వాణి, రఘునాథ్‌ల పెళ్ళి జరిగిపోయింది. తల్లి, తండ్రి, అన్నలలాగే వందన కూడా లాంఛనాల కోసం గాని, అధిక మర్యాదల కోసం గాని మోజు చూపించలేదు. ఉన్నదాంట్లోనే గౌరవంగా ఇచ్చిన లాంఛనాలను కూడా వారి మాట తీసేయలేక మొహమాటంగా పుచ్చుకుంది వందన.

"వదినని మంచి చేసుకుంటేనే గాని లాభం లేదు. అన్నయ్యతో వియ్యమందాలంటే..." అని హాస్యాలాడుతూ వాణి వేలికి ఉంగరం తొడిగి సన్నటి గొలుసు మెడలో వేసింది. పైకేమీ మాటలాడకపోయినా వాణి మొహం వెలిగిపోయింది. అది చూసి తృప్తిగా నిట్టూరుస్తూ "మాలో బాగా కలిసిపోతే బాగుణ్ను వదిన" అనుకుంది వందన.

మనుగుడుపుల్లో తన ఇంటిలో అట్టహాసంగా బంధుమిత్రుల్ని అందర్నీ పిలిచి గ్రాండ్‌గా పార్టీ ఏర్పాటు చేశాడు చంద్రశేఖరం. చక్కని లలిత సంగీతం పాడారు ఆర్కెస్ట్రా వాళ్ళు.

★ ★ ★

పెళ్ళి అయిన నెల్లాళ్ళకి వాణికి ఒక ప్రైవేటు స్కూల్లో టీచర్ పోస్టుకి పిలుపు వచ్చింది. వాణి చెల్లెలు వీణ అక్కగార్కి పంపిం దా కాగితలు. ఆ విషయం భర్తకి తెలిపింది వాణి. విని నవ్వేసి ఊరుకున్నాడు రఘు. చంద్రశేఖరం కొడుకు ద్వారా సంగతి విని కోడల్ని పిలిచి చెప్పాడు.

"చూడమ్మా వాణీ! నువ్వు సంపాదించాల్సిన పరిస్థితిలో మన సంసారం ఉంటే తప్పకుండా నేనే ప్రోత్సహించి పంపి ఉండేవాణ్ణి. నీ చేతి ఖర్చుకి డబ్బు నేను ఇస్తాను. అంటే... అదే ఆ ఉద్యోగంలో నీ కిచ్చేటంత డబ్బు అన్నమాట. రఘు సంపాదన కూడా తక్కువేమీ కాదు కనుక వాడి సంపాదన వాడిష్టం. నే నిచ్చేది మాత్రం నీకే. పూర్తిగా నీకే! సరేనా..." అంటూ కోడలి కళ్ళలోకి చూశా డాయన.

"మ... మరి... మరి..." ఒక చేతి బొటనవేలి గోరుకున్న క్యూటెక్స్‌ని ఇంకొక చేతి బొటన వేలితో గీకుతున్న వాణి సందేహంతో మాట్లాడలేకపోతోందని గ్రహించాడు ఆయన.

"నీకు ఉద్యోగం చెయ్యాలని సరదాగా ఉందా?" బుజ్జగిస్తున్నట్లు అడిగాడు చంద్రశేఖరం.

**తను** ఆ ఉద్యోగానికి అప్లై చేసిన నాటి **స్థితిగతులు** చెప్పాలని అనుకుంది. కాని నోరు పెగలలేదు. మామగారి ప్రశ్నకి జవాబు తన మనస్సులో వెతకసాగింది వాణి. ఆమె మనస్సు ఉయ్యాల లూగుతోంది. ఏం చెప్పాలో తెలియడం లే దామెకు.

స్వేచ్ఛ కోసం ఉద్యోగం చెయ్యాలనిపిస్తోంది. కాని మళ్ళీ ఆ స్వేచ్ఛ కోసమే ఉద్యోగ బాధ్యతలో చిక్కుకోకూడ దనిపిస్తోంది. కాని... కాని చాలా కష్టపడి చదివి ఇంటర్వ్యూలో పాసైంది తను. కాని తనకి ఇప్పు డది అనవసరం. ఏం చెయ్యను? ఏం చెప్పను? అయోమయంగా అన్పించింది వాణికి.

ఆమె ఆలోచనలోని భావాన్ని తొంబై పాళ్ళు గ్రహించాడు చంద్రశేఖరం. ఆయన సామాన్యుడు కాడు. ఎంత లోకజ్ఞానం జీర్ణించకపోతే చిన్న వయసులో వెయ్యి రూపాయలతో ప్రారంభించిన వ్యాపారాన్ని వృద్ధి చేసి ఇరవై లక్షలు ఆర్జించగలిగాడు.

"నువ్వు శ్రద్ధ తీసుకుంటానంటే మెయిన్ రోడ్డులో మనకి రెడీమేడ్ బట్టల కొట్టు ఒకటుంది. దానిమీద అజమాయిషీ నువ్వు తీసుకోవచ్చు. తప్పనిసరి కాదమ్మా! నీకు ఇష్టమైతేనే!" అని చెప్పి వెళ్ళబోతూండగా మరొక ఆలోచన తోచింది. వెనక్కి తిరిగిన వారు ముందుకి తిరిగాము మళ్ళీ.

వాణి అలాగే నిలబడి ఉంది. బొటనవేలి క్యూటెక్స్ గీకటం అయిపోయింది. చూపుడు వేలి క్యూటెక్స్ గీకుతోంది శ్రద్ధగా.

వెనక్కి తిరిగిన మామగారి వైపు తలెత్తి చూసింది వాణి.

"ఆ స్కూలు ప్రిన్సిపాల్ నాకు తెలుసు. మీ చెల్లెలి హైస్కూలు చదువు పూర్తయింది కనుక ఆ ఉద్యోగం ఆ అమ్మాయికి ఇమ్మని లెటరు వ్రాస్తాను. ఒక అప్లికేషన్ వ్రాసి పట్టుకెళ్ళి ఆ ప్రిన్సిపాల్‌కి ఇచ్చి పనిలో చేరిపొమ్మని వ్రాయి" అంటూ హడావిడిగా వెళ్ళిపోయాడు చంద్రశేఖరం.

మామగారి సహృదయతకి పొంగిపోయింది వాణి. అన్నీ వివరంగా చెల్లెలికి ఉత్తరం వ్రాసింది. మామగారు వ్రాసి ఇచ్చిన పరిచయ లేఖ తన ఉత్తరంలో జతపరచింది.

చంద్రశేఖరం గారి సహాయంతో వీణ కాన్వెంట్ స్కూల్లో అసిస్టెంట్ రైటర్‌గా చేరింది. వాణి చిన్న చెల్లెళ్ళు శృతి, కృతి హైస్కూల్లో చదువుతున్నారు.

[ముగింపు వచ్చే సంచికలో]